కాలము బట్టి సర్వమును కల్గుచునుండును రాకపోకలున్
కాలము బట్టి వచ్చుమరి కర్మకి లేమికి రాకపోకలున్
కాలమె సర్వజీవులకు కారణమన్నిటి కంటె చూచినన్
కాలము లాంగ జీయనిదొకండును లేదు ధాత్రిలోన్.

లోకమందు పెక్కు భీకర కృత్యముల్
కలుగు కారణంబు అరయ వలయు
స్వార్థరహిత సేవ సన్నగిల్లుట చేత
అర్థరహిత వాంఛలధికమవ్వ.

ప్రేమ స్వరూపులారా!

కాలము అనంతమైనది. ఇది అప్రమాణమైనట్టిది. అదే చరమైనది. కాలము ఎవ్వరికిని లొంగదు. సర్వము కాలము ననుసరించ వలసినదే గాని కాలమెవ్వరిని అనుసరించదు. కాలము భగవత్స్వరూపము. కనుకనే కాలస్వరూపాయ అని భగవంతునకొక పేరు. ఈ కాలమే ఆత్మస్వరూపము. ఆత్మ కాలమునకు ప్రధానమైన స్థానము. కనుక భగవంతునకు కాలాత్మకాయ అని మరొక పేరు. చరాచరప్రపంచమంతయు భగవంతుని యందే ఇమిడి వుండుటం చేత భగవంతునకు కాలగర్భాయ అని మరొక పేరు. కనుక మానవత్వమునకు కాలము చాలా ప్రధానము. కాలము సద్వినియోగపరచి, కాలము సరియైన రీతిలో అనుభవించి కాయమును సార్థకము గావించుకొనుచు కర్మనాచరించమని కాయము యొక్క ఉద్దేశ్యము. భగవంతునకు సంవత్సరాయనమః అని మరొక పేరు. సంవత్సరమనగా భక్తుని యొక్క స్థితిగతులను పురస్కరించుకొని వారికి శాంతిసుఖములందించే వాడని మరొక అర్థము.. ధీరత్వాయనమః అని మరొక పేరు. అనగా దేనియందు కూడను ఎట్టి బలహీనతలు లేక సంకల్పసిద్ధి చేత సర్వము సార్థకము గావించుటకు సమర్థుడు అని దీని అర్థము. 'మేధాయనమః' అనగా లోక సంబంధమైన తెలివి తేటలు గాని లేక మనస్సు యొక్క తత్త్వమును గాని గుర్తించేటువంటి వాడు కాదు. తనకున్న తెలివి తేటలను బుద్ధి కుశలతను పదిమందిపైన మరల్చి అటువైపున పరితపించే క్రియకు ఎవరు పాల్గొందురో అట్టి వారిని కాపాడు వాడు 'మేధాయనమః' అని.

కృత త్రేతా, ద్వాపర, కలియుగములకు ఆదియైన వాడు కనుకనే భగవంతునకు 'ఉగాది' అని

కేవలము యుగములకు మాత్రమే ఆదియైనవాడు కాదు. యుగములకు అంత్యమైనవాడు కూడను భగవంతుడే. కనుకనే యుగాదికృత్ అని మరొకపేరు వచ్చింది అతనికి. ఈ విధముగా నిత్య జీవితములో భగవంతుని నామము లేని నామ మనకు కనుపించదు! 'సహస్ర శీర్షా పురుషః సహస్రాక్షః సహస్రపాత్' అన్ని దేహములు, అన్ని శిరస్సులు, అన్ని నేత్రములు, అన్ని పాదములు కూడను భగవంతుని యొక్క ప్రతిబింబములు. ప్రతి ప్రాణి భగవంతుని యొక్క ప్రతిబింబమే. ఇలాంటి స్థితి యందు దైవమునకు ఒక పుట్టుక రావటం పోవటం అనే యీ రాకపోకల తత్త్వమే దివ్యత్వము. ఈ కాయములను కాలము చేత కర్మం చేత సార్థకము గావించుకునే నిమిత్తమై ఆవిర్భవించినది. కనుక కాలాయనమః, కాలకాలాయనమః కాలదర్ప దమనాయనమః' కాలాతీతాయనమః' కాలస్వరూపాయనమః' కాలనియమితాయనమః అని సర్వము కాలమునకు అంకితము గావించుకున్న స్థితి దివ్యత్వము. ఇతను ఎట్టి ప్రమాణములకు వశము కానటువంటి వాడు. ప్రత్యక్ష ప్రమాణము, అనుమాన ప్రమాణము, శబ్ద ప్రమాణము అని మూడు విధములైన ప్రమాణములు. ఇవి కేవలము ప్రాకృతమైన జీవితమునకు మాత్రమే ప్రమాణములు గాని భగవంతుడు యిట్టి ప్రమాణముల కు అతీతమైన వాడు కనుకనే అతనికి 'అప్రమేయుడు' అని మరొక పేరు.

(21) అట్టి అప్రమేయుడైన భగవంతుని త్యాగరాజు 'హృదయవాసి' అనే పేరుతో క్షీరసాగర శయనుడు అనే పేరుతో కీర్తించుచూ వచ్చాడు. 'చింతలు పెట్టవలెనా రామా! క్షీరసాగర శయనా నను' క్షీరసాగర శయనుడై సర్వులకు గోచరించు స్థానము నలంకరించిన నీవు నన్ను యిట్టి చింతలు పెట్టవలెనా?' అని ప్రశ్నించుచూ వచ్చాడు రాముని. పక్షులతో పశువులు బహిర్దృష్టి కలిగినవాడు మానవుడు. అంతర్దృష్టి కలిగినవాడు దైవము. కనుక మానవుడు అంతర్దృష్టిని అలవరచుకున్నప్పుడే దివ్యత్వాన్ని పొందగలడు. క్షీరసాగరముగా వుండవలసిన మానవుని యొక్క హృదయము అనేక విధములైన సమస్యలతో రాగద్వేషముల చేత కేవలము కల్మషమైన హృదయముగా రూపొందుతున్నది. మానవుడు క్షీరసాగరమైన హృదయాన్ని పవిత్రమైన దివ్యమైన భవ్యమైన నవ్యమైన పరిశుద్ధమైన హృదయంగా తీర్చుకున్నప్పుడే అక్కడ శేషశాయిగా స్థిరనివాసుడై వుంటాడు. పాలయొక్క వర్ణము శుద్ధ తెలుపు. ఈ శుద్ధమైన తెలుపు సాత్వికమునకు చిహ్నము. హృదయము యొక్క మానసిక తత్త్వమే క్షీరసాగరం. క్షీరసాగరంగా మారిన హృదయమందే భగవంతుడు నివసిస్తూ వుంటాడు. రాగద్వేషములనే తిమింగలములు యిందులో ప్రవేశించినప్పుడు యీ హృదయమనే సాగరము మాలిన్యమవుతుంది. ఈ క్షీరసాగరము మలిన పరచుటం చేత 'క్షారసాగరంగా' మారిపోతుంది. మానవ జీవితము యీ సాగరము నుండి ఆవిర్భవించినదే. విశాలమైన సాగరమందు అసంఖ్యాకమైన అలలు ఆవిర్భవిస్తూ వుంటాయి. ఒక అలవలె మరొకటి కనుపించదు. ఒకదానికొక టి భిన్నముగా కనుపిస్తూ వుంటుంది. కాని ఒక్కొక్క అల భిన్న భిన్నముగా కనుపించినప్పటికిని అన్ని అలల కు ఆధారస్థానము సముద్రమే. అన్ని అలలందు వున్నది సముద్ర జలమే. అదే విధముగనే సచ్చిదానంద సాగరము

నందు సచ్చిదానంద మయమైన దివ్యత్వము మానవత్వముగా, భిన్నభిన్నముగా, అంశ అంశముగా కూడను అవతరిస్తూ వచ్చింది. రూపనామములు వేరువేరుగా కనుపించినప్పటికి యీ అన్నింటికి ఆదియై మూలమై ఆధారమై వున్న తత్వము సచ్చిదానందమే. ప్రతి మానవుడు కూడను సచ్చిదానంద స్వరూపుడే. కాని రాగద్వేషములకు గురికావటం చేత యీ సత్ చిత్ ఆనందమనేది మనము విస్మరించి భౌతికమైన, పరిమితమైన వాంఛలకు లోబడి మన దివ్యమైన స్వస్వరూపాన్ని విస్మరిస్తున్నాము.

ప్రతి మానవుని యందు స్థూల సూక్ష్మ, కారణ రూపములనేవి అంతర్గతమై వుంటున్నవి. ఈ మూడింటి యొక్క స్వరూపము ప్రతి మానవుని యందు సాక్షాత్కరిస్తున్నది. ఈ త్రిమూర్తుల యొక్క స్వరూపమే త్రిగుణములుగా మారుతూ వచ్చాయి. ఈ మూడింటి యొక్క ఏకత్వము మనము బలపరచి దివ్యత్వమునకు అర్పితము గావించినప్పుడే అనేకత్వములోని ఏకత్వము గోచరిస్తుంది.

త్రిదళం త్రిగుణాకారం త్రినేత్రంచ త్రియాయుధం

త్రిజన్మ పాపసంహారం ఏకబిల్వం శివార్పణం.

ఈ మూడింటి ఏకత్వము చేత దైవత్వమునకు అర్పితము గావించటమే యీ బిల్వము యొక్క అర్థము. తెలుగు దేశములో చింతగుల్ల అంటారు. చింతకాయ వేదాంతము బోధిస్తూ వచ్చింది. ఈ చింతపండు లోపల గింజలో కాయ స్వరూపముగా మారును. చింతగుల్ల, చింతపండు, చింతవిత్తనము యీ మూడింటి స్వరూపమే స్థూల సూక్ష్మ కారణ స్వరూపము. ఇదే unity in diversity. అనేకత్వములో వుండిన ఏకత్వమే యిది. పండులేక విత్తనము కాదు. కనుకనే స్థూలదేహము చింతగుల్లవంటిది. 'అనిత్యం అసుఖం లోకం' ఈ దేహము కేవలము నీటి బుడగవంటిది. ఇలాంటి దేహము స్థూల రూపకంగా అన్నమయమైన రూపాన్ని ధరిస్తూ వచ్చింది. ఇది.

మలినవు కాంప భోగముల మగ్నుడు సేవక గుంప జాతసం
చలనము పొందు దుంప భవసాగర మదగ లేని కంప అం
బులపొది వెమ్ము చూడ మన మెప్పుదలంప గదేహ మింక ని
శ్చలమని నమ్మబోకు మనసా హరిపాదము లాశ్రయింపవే.

ఈ తత్వాన్ని గుర్తించే నిమిత్తమై యీ యొక్క అస్థిరమైన దేహము ధరించారు. ఈ దేహమును నడిపించి కదిపించి, వినిపించి, అనిపించి, మరపించి తన్మయత్వము గావించేది మనస్ తత్వము. కన్నులు చూస్తున్నాయని మనం భావిస్తాం. చెవులు వింటున్నాయని మనం విశ్వసిస్తాము. నోరే మాట్లాడుతుందని మనం అనుకుంటున్నాం. కనుపించేది కన్నులైతే, వినిపించేది చెవులైతే, పలికేదే నోరైతే మరణించిన తరువాత అవే కన్నులు, అవే చెవులు, అదే నోరు వుంటున్నవి. ఎందుకు కనుపించటంలేదు? ఎందుకు వినిపించటంలేదు

ఎందుకు కనుపించటం లేదు? కాదు. కాదు. కనుపించి, వినుపించి, అనుభవింపజేసి మైమరపించే శక్తి అంతర్యామితమై అన్నింటికిని ప్రాణము ఇచ్చి ప్రోత్సహించి నడిపించేది ఆత్మతత్త్వము.

ఇవన్నియు కేవలము పనిముట్లు. దీనికే కరణములని పేరు. కరణములనగా పనిముట్లు. చేతిలో ఒక కత్తిని పట్టుకున్నప్పుడు కత్తి కోస్తున్నదా? తన స్వశక్తితో ఫలమును కోస్తున్నాడా. కత్తి నిమిత్తమాత్రముగా పట్టుకొని వ్యక్తి ఆ ఫలమును కోస్తున్నాడు. కనుకనే భగవద్గీత యందు కూడను 'నిమిత్త మాత్రం భవసవ్యసాచిః' నిన్ను నిమిత్త మాత్రంగా వుంచుకొని సర్వవిధమైన కర్మలు నేను ఆచరింపచేస్తున్నాను. అర్జునునకు పార్థివ అని మరొక పేరు. పార్థివ అనగా పృథ్వీ పుత్రుడు. మీరందరు పృథ్వీపుత్రులే. పార్థులే. మిమ్మల్ని నిమిత్త మాత్రంగా నిల్పుకొని యిన్ని విధములైన కర్మలు ఆచరింపజేసి సాధనలు సల్పుతున్నట్లు చేస్తూ వుండేది కేవలము దివ్యశక్తియే. అది అందరియందు వుండిన శక్తి.

(3) కనుక ఇది జ్యోతి. ఇరువురు ప్రొఫెసర్లు చెప్పారు. ప్రేమ జ్యోతి, సత్య జ్యోతి, ఆత్మ జ్యోతి, అఖండ జ్యోతి, అద్వైత జ్యోతి, ఆనంద జ్యోతి. జ్యోతికి మించిన వస్తువు యీ ప్రాకృతమైన జగమునందు కనుపించదు. జ్యోతికి వుండిన శక్తి మరొక పదార్థమునకు లేదు. జ్యోతికి అంధకారమును దూరము చేసే శక్తి వుంది. అంధకారము దూరము చేసే శక్తి మరి యే వస్తువుకు లేదు. కనుకనే 'తమసోమా జ్యోతిర్గమయ' అని. ఈ జ్యోతికి యీ ఒక్క శక్తి మాత్రమే కాదు రెండవది కూడా వుంటున్నది. జ్యోతి నిరంతరము ఊర్ధ్వస్థాయికి పోతుంటుంది. గుంతలో జ్యోతిని పెట్టినా వెలుతురు పైకి వస్తుందిగాని క్రిందికి పోదు. అంధకారము నిర్మూలము గావించటము, ఉన్నతస్థాయికి దూసుకొని పోవటం యీ జ్యోతి యొక్క ప్రధానమైన గుణములు. ఇట్టి జ్యోతిని నిరంతరము అఖండ జ్యోతిగా వెలగవలెనంటే దీనికి ఆధారము ఒకటి వుండాలి. ఈ జ్యోతికి ప్రమిద అవసరము. ఇది కాక వత్తి ఒకటి వుంటుండాలి. ప్రమిదలో నూనె వుండాలి. ప్రమిద, వత్తి, నూనె వుండినంత మాత్రమున జ్యోతి వెలగదు. దానికి నిప్పు అవసరం.

ప్రమిద నూనె వత్తి కలదు దీపము వెలుగునా
స్వర్ణము రత్నలు గలవు సొమ్ములు నిర్మాణమగునా
పూలు సూది దారము వుండి పుష్పమాల తానగునా!

పూలు, దారము, సూది వుండి కానీ కుట్టేవాడు ఒకరు వుండాలి కదా. స్వర్ణము, రత్నాలు వుండినప్పటికి సొమ్ములు చేసే కంసాలి ఒకడుండాలి. ప్రమిద, నూనె, వత్తి వుండినప్పటికి అంటించేవాడు ఒకడుండాలి. అతనే భగవంతుడు. అట్టి దైవమును ఆశ్రయించినప్పుడే మానవత్వము కూడను దివ్యత్వముగా మారిపోతుంది. ప్రేమ స్వరూపులారా. మన యొక్క హృదయమే ప్రమిద. మన మనస్సే యిందులో వత్తి. మన భక్తియే యిందులో తైలము. వైరాగ్యమే దీనికి నిప్పు పెట్టె. ప్రేమయే యీ జ్యోతి యొక్క స్వరూపము. ఈ ప్రేమ జ్యోతి

లేనప్పుడు మానవుడు అజ్ఞానాంధకారములో మునిగిపోతాడు.

ప్రేమ ప్రతి ప్రాణికి కూడను ప్రధానమైనది. ఆనాడు గోపికలు ప్రేమ జ్యోతిని వెలిగించమని కృష్ణుని ప్రార్థించారు

ప్రేమ రహిత మరు భూములలో
ప్రేమాంకురములు పెంపొంద
ప్రేమావేశములో
ప్రేమ సుధా వర్షము వర్షింపగ
ప్రేమ నదులు ప్రవహింపగ
మురళీ గానము సేయగదే
కృష్ణా గానము సేయగదే.

ప్రేమరహితమైన మా హృదయ భూమియందు ప్రేమ అనే వర్షము కురిపించి, ప్రేమ అనే బీజములు నాటి ప్రేమ ఫలములు పండించటానికి యీ ప్రేమ గుర్తించటానికి ప్రేమ మధురమైన మురళి వాయించమని కోరారు. ఈనాడు ప్రతి మానవుని యొక్క హృదయమందు కూడను ప్రేమ బీజములు నాటుకోవాలి. ప్రేమయే పరమార్థము. ద్వేషము యేమాత్రము ఇందులో ప్రవేశించ కూడదు. రాగద్వేషములకు అవకాశము అందించరాదు. అజ్ఞానములో మానవుడు వుండటం చేతనే మనకు రాగద్వేషము లావిర్భవిస్తూ వుంటాయి. మానవుని యొక్క మంచి చెడ్డలు, మానవుని యొక్క ఉపకార అపకారములు, మానవుని యొక్క మిత్రులు, శత్రువులు మానవుడు చేసే కర్మలే. తాను చేసిన మంచి కర్మలే మిత్రుని వలె తనను వెంటాడి అన్ని విధముల కూడను సహాయపడతాయి. మనము నెరవేర్చిన చెడ్డకార్యములే మనలను బాధిస్తూ వుంటాయి. మనకు ఆనందము నిచ్చేవి దుఃఖము నిచ్చేవి మనము చేసే కర్మలే తప్ప వేరు కాదు. కనుక మనము మంచి కార్యములు చెయ్యాలి. ప్రేమ హృదయాన్ని మనం పెంచుకోవాలి. అప్పుడే మనము ప్రేమమయమైన జీవితాన్ని తెలుసుకోగలము. ప్రేమయే పరమాత్మ స్వరూపము. ప్రేమ ఫలితమును ఆశించదు. ప్రేమ పరులకు భయపడదు. ప్రేమ నిమిత్తమై ప్రేమను పెంచుకోవాలి. ఇదే ప్రేమయొక్క ప్రమాణము. కనుక ప్రేమ జ్యోతి మనయందు వెలగాలంటే హృదయము ప్రమిదగాను, మనస్సు వత్తిగాను, భక్తి తైలముగాను వుంచుకొని వైరాగ్యమనే జ్యోతిని మనము వెలిగించుకోవాలి. ప్రాకృతమైన జ్యోతులు బాహ్యమైన చీకటులను మాత్రమే పారద్రోలుతాయి. కాని యీ ప్రేమ జ్యోతి, యీ అఖండ జ్యోతి, యీ అద్వైత జ్యోతి అంతర్ముఖమైన ఆనందాన్ని ప్రకాశమును అభివృద్ధిపరుస్తుంది.

భగవంతుని అప్పస్వరూపమైన నామములందు

720109006

శబ్ద బ్రహ్మమయి చరాచరమయి జ్యోతిర్మయి వాఙ్మయి
నిత్యానందమయి పరాత్పరమయి మాయామయి శ్రీమయి

మూడవ స్థానములో వుంటున్నది జ్యోతిర్మయి. కనుక జ్యోతిర్మయ స్వరూపమైనది మానవ జీవితము. మానవుడు కేవలము అజ్ఞాని అనిగాని లేక మూర్ఖుడనిగాని లేక బలహీనుడనిగాని భావించరాదు. మానవుడు తలచుకుంటే శ్రద్ధావాన్ లభతే జ్ఞానం. శ్రద్ధ వుండినప్పుడు ఎంతటి కార్యమునైనా సాధించగలడు. ఈనాడు జ్యోతిని పురస్కరించి గ్రామ గ్రామము వీధి వీధి వాడ వాడ ప్రచార ప్రబోధలు సల్పుటమంటే యీ శ్రద్ధ వలన గలిగినదే గాని కేవలము ఒక విధమైన ఆడంబరము వలన జరిగినటువంటిది కాదు. ప్రతి మానవునకు శ్రద్ధ అవసరము. శ్రద్ధ కలిగిన వారు ఏకార్యమునైనా సాధించగలరు. ఆధ్యాత్మిక మార్గమునందు అత్యంత శ్రద్ధ కలిగి వుండాలి.

ప్రేమస్వరూపులారా! శ్రద్ధయే మనయింటా వెంటా జంటా కంటా వుంటుండి అన్నివిధాలా కాపాడేటువంటిది. శ్రద్ధ కలిగిన వానికి సాధించలేనిది జగత్తులో కానరాదు. ఈ శ్రద్ధకు యిచ్ఛాశక్తిని అభివృద్ధి పరచుకోవాలి. ఇచ్ఛాశక్తి వలన క్రియాశక్తి, యీ యిచ్ఛా క్రియాశక్తుల వలనే జ్ఞానశక్తి ఏర్పడుతుంది. ఈ మూడింటిని త్రికరణశుద్ధి అని వేదాంతము బోధిస్తూ వచ్చింది. మనసునందు భావము మాటయందు చెప్పి మాటయందున్న భావము క్రియయందు అనుభవించాలి.

(4) ప్రేమస్వరూపులారా! ప్రతిమానవుడు శాంతి శాంతి శాంతి కావాలని ఆశిస్తున్నాడు. శాంతి ఎక్కడో లేదు. ఈ అశాంతికి కారణము ఏమిటో మనము వెతకాలి. ఈ అశాంతికి కారణము మనము గుర్తించి దానిని పరిహారము గావించుకున్నప్పుడే శాంతి సహజముగానే ఆవిర్భవిస్తుంది. ఇంటిలో తల్లి, తండ్రి, కుమారుడు ముగ్గురు వుంటున్నారు. ఈ తల్లి తండ్రి కుమారుడు ప్రేమతో కాలాన్ని గడుపుతూ వుండినంతవరకు ఒకరినొకరు విశ్వసించి ఒకరినొకరు ప్రేమించుకుంటూ వుండినంతవరకు శాంతి యింటియందు అభివృద్ధి అవుతుంది. ఈ తల్లి తండ్రి కుమారుడు యీ ముగ్గురు ఒకరికి ఒకరు యేమాత్రము కూడను సంబంధము లేకుండా ఒకరినొకరు అనుసరించకుండా ద్వేషముతో అసూయతో విరుద్ధమైన మార్గము అనుసరించునప్పుడు ఆయింటిలో వంటిలో అశాంతినే అనుభవించవలసి వస్తుంది. ఈ శాంతికి అశాంతికి కారణం ఏమిటి? కలయిక లేక ద్వేషము పెంచుకోటం చేతనే అశాంతి అభివృద్ధి అయింది. అది మన హృదయతత్వము. మాటయొక్క అర్థము క్రియయొక్క ఆచరణ. ఇక్కడ మనస్సు మాట తల్లి తండ్రులు. క్రియయే కుమారుడు. ఈ ముగ్గురు ఏకమైనప్పుడు శాంతిని యేమాత్రము వెతుకో నక్కర లేదు. ఈనాడు శాంతి లేకుండా వుంటున్నాడంటే మనసు వేరు, మాట వేరు, క్రియ వేరుగా వుండటం చేతనే అశాంతికి గురైపోతున్నారు. ఈ మూడింటిని ఏకము గావించే వ్యక్తికి శాంతి వుంటుంది. ఈ అశాంతి కొకరు కారణమని మనము భావించరాదు. ఎవరు కూడను దానికి కర్త కాదు.

నీ ప్రయత్నమే దీనికి కారణము 'మనస్యేకం వచస్యేకం కర్మణ్యేకం మహాత్మనాం'. ఇదే నిజమైన శాంతి. ఈనాడు యీ మూడింటి ఏకత్వము లేకపోవటం చేతనే, భిన్నత్వంగా వుండటం చేతనే మానవుడు అశాంతికి గురైపోతున్నాడు. మన అశాంతికి వీరు కారణము, వారు కారణము, ఈ కర్మ కారణము అని భావిస్తున్నాము. ఇది కేవలము అల్పదృష్టి. నీ అశాంతికి నీవే కారణము. ఆ కారణమును గుర్తించి వర్తించినప్పుడే మనకు అశాంతి దూరమై పోతుంది. నిజమైన త్రికరణ శుద్ధిని అభివృద్ధి గావించుకొని ప్రేమ తత్త్వాన్ని పెంచుకున్నప్పుడు మనయొక్క జీవన జ్యోతి ప్రకాశంగా మనకు మనమే అనుభవించటం కాకుండా యితరులకు కూడను యీ ప్రకాశాన్ని అందించి వారికి కూడను అంధకార అజ్ఞానమును దూరము గావించిన వారమవుతాము.

నేను సాయిని తెలియుము నిక్కముగను
మమత బాయుము యత్నముల్ మానుకొనుము
బాహ్య సంబంధమిక కాదు నన్ను బట్ట
ఎంతటి ఘనునికైన తప్పింప వీలుకాదు

అని యీ పలుకులు పలికినప్పుడు తమ్మిరాజు కుటుంబము, హనుమంతరావు కుటుంబము, భోజరాజు కుటుంబము, శేషమరాజు కుటుంబము వీరందరు కూడను అనేక విధముల గా అడ్డుపడి వెళ్ళకూడదు అన్నారు. ఇది ఉరవకొండలో జరిగింది. జీవప్రజ్ఞతో బాటు దైవప్రజ్ఞ దైవప్రజ్ఞతో బాటు జీవప్రజ్ఞ అని యోదేహా మనకు కొన్ని సంబంధములు దూరము కావాలనుకున్నప్పుడు ఆదర్శముగా వైరాగ్యమును నిరూపించాలి. ఉరవకొండలో వుండగా మునిసిపల్ ఛైర్మెన్ రామరాజు వచ్చి స్వామిని చూచాడు. అప్పుడు రాజు రాజూ అని పిలచేవారు. చూచి శేషమరాజును ప్రార్థించాడు. ఆ పిల్లవానిని హాలిడేస్‌లో మాయింటిలో పెట్టుకుంటాము బళ్ళారి తీసుకు వెడతాము అన్నారు. 'శేషమరాజూ! ఈ బాలుని సామాన్యమైన సోదరునిగా భావిస్తున్నావు. ఇతని ముఖవర్చస్సు, యితని యొక్క పవిత్రత నా హృదయాన్ని కరగించింది. కదిలించింది. ఇతనిలో యేదో దివ్యశక్తి ఒక దివ్య తేజస్సు వుంది. నీవు మోసపోతున్నావు. నీవు కూడా అబ్బాయితో వచ్చి మాయింటిలో వుండమన్నాడు. అక్కడ నుండి యీ మునిసిపల్ ఛైర్మన్ హంపికి తీసుకువెళ్ళాడు. ఇది కేవలము అతిశయోక్తి గాని, అహంకారముగాని మరొక విధమైన వర్ణనగాని అని భావించరాదు. అందరూ విరూపాక్ష దేవాలయములో ప్రవేశించారు. నేను రానని చెప్పుతే వత్తిడి చేయవచ్చు. కోపము పడవచ్చు. నా కడుపులో బాగ లేదు నేను లోపలకు రానన్నాను. ఈ అందరూ తమ్మిరాజులో గూడ 50,60 మంది దేవాలయములో ప్రవేశించారు. కాని యీ రామరాజుకు స్వామి చింతన తప్ప అన్య చింతన లేదు. అతను చాలా వినయంగా కోరుతూ వచ్చాడు. అప్పుడు నేను చాలా చిన్నవాడిని. Please Please రాజా తప్పక రావాలి రావాలి అని చేతులు పట్టుకొని బాధ పడ్డాడు. కానీ నా యొక్క గట్టితనాన్ని బట్టి నన్ను ఎక్కువ తొందర పెట్టలేక పోయాడు. విరూపాక్షుని గుడిలో

హారతి యిస్తున్నారు. అక్కడ విరూపాక్షుడు లేడు. యీ రాజు వున్నాడు. శేషమరాజుకు కోపం వచ్చింది. నేను రానని చెప్పి ఎప్పుడో వెనక్కిపోయి లోపలనుంచున్నాడు ఎంత పొరపాటు. ఎంత తప్పు. చాలా కోపం వచ్చింది. కానీ రామరాజు ఆవిధంగా భావించలేదు. విరూపాక్షుడే రాజు రాజే విరూపాక్షుడు అనుకున్నాడు. తక్షణం శేషమరాజు బయటకు వచ్చాడు చూచాడు. నేను అక్కడే చెట్టు క్రింద కూర్చున్నాను. ఆయనకు అనుమానం ఎక్కువ. మరి యింకొకరిని పంపించాడు అక్కడ కనుపిస్తున్నాడా లేడా అని. నేను యిక్కడ చూస్తూవుంటాను లోనికి రాకుండా అని యిన్ని విధాల పరీక్షలు ప్రారంభించారు. రాజు అక్కడా వున్నాడు యిక్కడా వున్నాడు. చాలా ఆనందించారు. నాదగ్గర చెబితే బాగుండదను కాని వారు కేవలం మనసుయొక్క ఆర్తి ఆవిధంగా కనుపించిందనుకున్నారు.

(5) అక్కడనుండి నేరుగా బళ్ళారి తీసుకొని వచ్చారు. కొన్నిదినము లక్కడ వుండిన తరువాత ఆ మునిసిపల్ ఆఫీసర్సు అందరు రావటం వారినందరిని స్వామికి పరిచయం చేయుటము (స్వామి అనే పేరు లేదు రాజు రాజు అని) యీ చిన్న పిల్లవానికి యీ మునిసిపల్ ఛైర్మన్ యింత గౌరవము యిస్తున్నారని కొంత మంది హాస్యాస్పదము చేశారు. నాకు అక్కడనుండి యీ వచ్చేదానికి ముందుగా మునిసిపల్ ఛైర్మన్ ఒక చిన్న నిక్కరు షర్టు కుట్టించాడు. ఇప్పుడు యింత ఎత్తు వున్నాను అప్పుడింకా... ఆనాడు అనగా 50 సంవత్సరముల పూర్వము యువకులందరికి ఒక ఫ్యాషన్ వుండేది. కాలర్ కు ఒక పిన్ను వేసుకునే వారు. అది కాలర్ పిన్. ఆనాడు కాలర్ పిన్ వేసుకుంటే అది ఒక పెద్ద స్థానమని, మంచి ఉన్నతమైన స్థితిలో వుండిన వారని భావించే వారు. నాకు యింక యేమి యివ్వటానికి తోచలేదు. ఒక్క గంటలోనే కంసాలి దగ్గరకు పోయి గోల్డు కాలర్ పిన్ చేయించుకు వచ్చి నా కాలర్ కు తగిలించాడు. రాజు, యీపిన్నును చూచినప్పుడంతా నేను జ్ఞాపకము రావాలి అని చేతులు తట్టుకొని ప్రార్థించాడు. సరే వచ్చాము. ఉరవకొండలో బస్సుదిగాము రెండవ దినమే స్కూలు ప్రారంభము. ఇంక స్కూలుకు వెళుతున్నాను. మధ్యలో యీ కాలర్ పిన్ను క్రింద పడిపోయింది. అప్పుడు నేనొక పాట పాడినాను. ఈ కాలర్ పిన్ పోయిన తక్షణమే బంధన వీడింది అన్నాను.

అక్టోబరు యిరవయ్యో తేదీ
హంపీనుండి స్కూలుకరుగుచు
బాబా కాలరు పిన్నొకటి
జారి కనబడ లేదు
మార్పు కలిగి వున్నాడు
ప్రాపంచిక సంబంధము క్రింద
ఇతని కెందుకు క్షేత్రదర్శనము

అది కూడా తెల్లిను పొద్దు మాయ తొలగెను

అదినమే గృహము వీడెను

మార్పు రావటానికి యీ కాలర్ పిన్ను పోయింది. ఇదే మార్పు. ఆనాడే గృహాన్ని విడచిపెట్టాను. ఇంతాక మాయ అనగా ప్రాపంచిక సంబంధమైన వస్తువే ఒక మాయ.

ఈ వస్తువులు ఏనాడు మనలను వీడి పోతాయో అదే మాయ తప్పటం. ఆనాడే వెళ్ళి ఆంజనేయులు యొక్క గృహము లోపల ఒక పెద్ద గుండు వుండేది. ఆగుండుపైన కూర్చున్నాను. అతను ఎక్సైజు కమీషనరుగా వుండేవాడు. ఆయన కూడను స్వామిని చూస్తే యేదో అరువి తెలియనటువంటి ఆధ్యాత్మిక భావము వుట్టిపడేది. దోవలో వుంది అతని యిల్లు. అతను పకోడాలు యేవో చేసి లోపల పెట్టుకొని వుండేటువంటి వాడు, ఆయన, ఆయన భార్య కాచుకొని వుండేవారు పాపం. పిల్లలుంటే యేమైనా అనుకుంటారోమో నని వారిని లోపలకు పంపించేవారు. నేను చిన్నగా లోపలికి ప్రవేశించేటప్పటికి కాళ్లను పట్టుకొని నమస్కారం చేసేవారు. సార్ మీరు పెద్దవారు యీ విధముగా చేయ కూడదు నేను ఎంతో చెప్పేవాడిని. రాజూ! ఈ దేహముతో నేను పెద్దవానిగా వుంటున్నాను. కాని జ్ఞానములో చాలా అల్పుడుగా వుంటున్నాను. నీవు సాక్షాత్తూ కృష్ణుడవే. యీ విధముగా వారు వర్ణించేవారు. అందరు ఎదురుగా వర్ణిస్తే ఎవ్వరైనా హాస్యాస్పదము చేస్తారేమో నని వంటరిగా పిల్చి చెప్పేవారు. ఈ విధముగా అనేక విషయాలు యీ అక్టోబరులో జరిగాయి. ఆనాడు ఎక్కడకు పోలేదు. స్కూలుకు పోలేదు. స్కూలులో ప్రతిదినము ప్రార్థన చేసేవాడిని. కోట్లకి పెట్టి ఒక వేదిక మాదిరి వుండేది.

అనగా అప్పుడే సర్వమత సమన్వయాన్ని ఏమిటి? యీ పిల్లవాడు సర్వమత సమన్వయాన్ని బోధిస్తూ వున్నాడే. అని టీచర్సుకు విసుగు పుట్టేది పాపం. ఆనాడు స్కూలుకు పోకుండా వుండటం చేత ఎక్కడరాజు ఎక్కడ రాజు అని ఒక పెద్ద విచారం ప్రారంభమైంది. పిల్లలు ఎవరూ ప్రార్థనలో లేరు. అందరు ఆంజనేయులు యొక్క గృహానికి పరుగెత్తి వచ్చారు. ఎవరిని నేను చూడలేదు. నేను వూరకే కూర్చున్నాను. ఒక గుండుపైన.

హంపి నుండి వచ్చినప్పటి నుండి మతిభ్రమణం కలిగింది. ఇంట్లో యేమైనా జరిగిందో ఏమిటో అని పిల్లలు ఒక్కొక్కరు ఒక్కొక్కరకంగా వూహిస్తూ వచ్చారు. నా ఫోటో ఒకటి తీసుకోండి అని చెప్పాను. ఫోటో తీసుకుంటే నాముందు షిరిడీ బాబా. ఆనాడు సాయిబాబా అంటే ఎవరికీ తెలియదు. ఇప్పుడు ఆ గుంపులో కూడను ఆంజనేయులే వుంటున్నాడు. ఆయనే మన జిల్లా కంతా కూడను సత్యసాయి ఆర్గనైజేషన్ ఛైర్మన్. ఆ ఫోటో అతనికి కూడా తెలుసు. ప్రార్థన చేసి నన్ను ప్రారంభించమని చెప్పాను. ఈలోప

లనే శేషమరాజు పుట్టపర్తి టెలిగ్రాము ఇచ్చేవాడు. అక్కడికి కొందరు పరుగెత్తి వచ్చారు. ఇంక అక్కడ వుండ కూడదు పుట్టపర్తి పోవాలని అనుకున్నారు. అప్పుడు బస్సులు లేవు బుక్కపట్నం. పెనుకొండ వరకు మాత్రమే బస్సు. అక్కడనుండి ఎడ్లబండిలో రావాలి. ఇటువంటి పరిస్థితి ఆనాడు. ఈ పిల్లలంతా మేము కూడా రాజుతో వస్తామని బయలుదేరారు.

అక్కడ చాలా విచారకర విషయము జరిగింది. ముగ్గురు పిల్లలు ఒకేడస్కులో కూర్చునే వారు ఒకపిల్లవాడు శిరస్తదారు కుమారుడు. ఇంకొక అబ్బాయి రెవిన్యూ ఇన్స్పెక్టరు కొడుకు. వారు కొంతవరకు శ్రీమంతులే. నేను మధ్యలో కూర్చునే వాడిని. ఒకరు ఇటువైపు ఒకరు అటువైపు కూర్చునే వారు. ఈ పిల్లలకు అవిధమైన దర్శన స్పర్శన సంభాషణాల చేత వారి హృదయాలు మారిపోయాయి. బాబాసంబంధం దినదినానికి అభివృద్ధి చెందింది. ఏనాడు ఆ స్కూలు వదిలారో ఆపిల్లలిద్దరికి మతిభ్రమకా జరిగినట్లుగా రాజు రాజు అని ఆందోళన అభివృద్ధి అయింది. బస్సు ఎక్కాను. అదృశ్యమై చూడాడు. పెళ్ళిబావిలో పడిపోయాడు రాజును విడచి నేనుండలేని చని పోయాడు. రెండవ పిల్లవాడు రాజు రాజు అంటూ భోజనము చేయలేదు నీరు లేదు ఆహారము లేక పూర్తి స్తంభించి పోయాడు. ఈ రకమైన ఉన్నతత ఆధ్యాత్మికము యొక్క తత్త్వము. కాని చాలా మంది ఉన్నతత అంటే బాహ్యమైన జగద్భ్రాంతిని విస్మరించటమని భావిస్తూ వుంటారు. ఈ విధముగా ఇరువురు పిల్లలు పోవటం చేతనే ఆనాడు స్కూలు మూసి వేశారు. ఆ డస్కు సత్యసాయి బాబాడస్కు అని పెట్టారు.

లక్ష్మీపతి గారని హెడ్మాష్టరు వుండేవాడు. ఆ లక్ష్మీపతి కూడను నేను స్కూలుకు వచ్చిన తక్షణమే ఆఫీసుకు రమ్మనేది. అది అందరికి లభించదు జన్మాంతర ప్రాప్తి వలన ఆవిధమైన భావాలు వస్తాయి. లోపలకు వెళ్ళిన తక్షణమే తలుపులు వేసేవాడు. నన్ను తన కుర్చీపైన కూర్చోమని చెప్పేవాడు. తాను క్రింద కూర్చొని పాదాలు పట్టేవాడు. సార్ యీవిధంగా చేయకూడదు మీరు అని చెప్పేవాడిని అమాయకునిలా. ఆ లక్ష్మీపతి చెప్పేవాడు. నీకు తెలీదు. నాకు తెలుసు నీదివ్యత్వము. ఈ విధముగా ఆనాడు ఉరవకొండ లోపల ఇటువంటి అనుభవములన్నీ వున్నాయి. ఈ అక్టోబరు 20వ తేదీ ఉరవకొండలో పూర్తిగా మార్పు తెచ్చిన దినము. ఆనాడు విద్యార్థులందరిలో గొప్పమార్పు కలిగినది.

వారి యొక్క ఆప్యాయత, వారి యొక్క ప్రేమతత్త్వము నాయందు ఎంతవరకు పెరిగిందంటే ఒక చిన్న ఉదాహరణము. రెండవదినము కొత్త వాడు ప్రార్థన చేయటానికి వేదిక ఎక్కాడు. ప్రార్థన చేయటానికి ప్రారంభించాడు. గట్టిగా ఏడ్చేశాడు. ఆ పిల్లవానికి స్వామి జ్ఞాపకం వచ్చాడు. ఈ పిల్లవాడు ఏడ్చే టప్పటికి అందరూ ఏడ్చేశారు. ప్రార్థన అంతా ఏడ్పుగా మారిపోయింది. అప్పుడు హెడ్మాష్టరు చెప్పాడు 'లోపలికి పొండి. అతని నిమిత్తమై మనము ఏడ్చిన ఏడుపే మన prayers. ఆనాటితో ఆరూమ

ను తాళం వేసి ఒక పెద్ద సింహాసనంగా తయారు చేశారు. ఆనాటి మానవత్వము యింత అమాయకముగా వుండినప్పటికిని ఆనాడు విద్యార్థులు కేవలము పవిత్రమైన హృదయాలతో వుండేవారు. ఈనాటి విద్యార్థులవలె విమర్శలుగాని యింకే విధమైన కొన్ని క్రియలుగాని, ఆలోచనలుగాని, పరిశీలనలుగాని, పరిశోధనలుగాని యేమాత్రము ప్రారంభించలేదు. ఈనాటి విద్యార్థులకు తెలివితేటలు పెరుగుతూ వస్తున్నాయిగాని సుగుణము తరుగుతూ వస్తున్నది. ఈ తెలివితేటలు తక్కువ ఆరోజులలో. ఆదినాన్నే యీనాడు ఆంధ్రదేశము వారివిధముగా ప్రశాంతి నిలయమునకు వచ్చి ఒక జ్ఞాపకార్థముగా పవిత్రముగా జరుపుకుంటున్నారు.

(6) ప్రేమస్వరూపులారా! ఇది ఒక గర్వకారణంగా మీరు భావించుకోండి. ఇది సత్యదృష్టితో మీరు విశ్వసించాలి. 50 సంవత్సరముల లోపల యీ ప్రశాంతి నిలయములో సాధించిన ఘనత 500 సంవత్సరములైనప్పటికిని జరిగేది కాదు. 50 సంవత్సరముల లోపల యీ విధమైన ఘనమైన మార్పులు ఎక్కడ కూడను జరగలేదు. ఈ ఒక్క చోట మీదుగా జరుగుతూ వచ్చాయి. ఒక పెద్ద యూనివర్శిటీ ప్రారంభించాము. నక్షత్రశాలను తెప్పించాము. ఈ చిన్న గ్రామములో air field వచ్చింది. యావత్ప్రపంచమునకు ప్రశాంతినిలయం తెలిసింది. అన్ని దేశములవారు ప్రశాంతినిలయములో ప్రవేశిస్తున్నారు. ప్రశాంతి నిలయమనేది ఒక మినీ వరల్డ్. ఇంకా ముందు ముందు మీరు చూస్తారు. నవంబరు 23 వ తేదీకి అన్ని దేశములవారు యిక్కడకు వస్తున్నారు. పిలిస్తే వచ్చే స్వభావమా మనుష్యులది. ఎవ్వరికీ యే ప్రచారముగాని ఏ invitations గాని పంపటంలేదు. వచ్చేటువంటివారిని వద్దు వద్దు అని చెబుతున్నారు. ఈ విధమైన ఆకర్షణ ఒక దైవానికి తప్ప అన్యులకు లేదు. పుష్పము యొక్క సుగంధము సర్వత్ర వ్యాపించుతుంది. పుష్పము తుమ్మెదను పిలుస్తుందా? తుమ్మెదే పరుగెత్తి వచ్చి యీ పుష్పములో ప్రవేశిస్తున్నాయి. ఈ పుష్పములో మధురమైన మకరందము వుండటంచేత తుమ్మెదలు వచ్చి వాలుతున్నాయిగాని లేకపోతే ప్రార్థించినా వాలుతాయా? ఎక్కడి అర్జంటైనా. ప్రపంచమునకు కట్టకడపటి స్థానములో వున్నది అర్జంటైనా. ఈ అర్జంటైనా లో యింటింటి లోపల భజనలు 'మాయమా' అని వుంటున్నది. అక్కడ మిలిటరీ ఆఫీసర్సు అందరు నగరసంకీర్తన చేస్తున్నారు. పోయిన ఆరునెలల క్రితము ఆఫీసర్సు అంతా ఒక ప్రతిజ్ఞ పట్టారు. చాలామంది పేపర్లో కూడా చూచి వుంటారు. గవర్నమెంటు పోవాలి. సత్యసాయి గవర్నమెంటు రావాలని వారి ప్రతిజ్ఞ. మిలిట్రీ ఆఫీసర్సుకు పిచ్చి పట్టిందని తీసుకువెళ్ళి మెంటల్ హాస్పిటలులో చేర్చారు. మిలిట్రీ ఆఫీసర్సు ఆసుపత్రిలో చేరి అక్కడ వున్న నర్సులను, పేషంట్లను భక్తులుగా మార్చివేశారు. ఇది అంత సులభముగా జరిగేటువంటిది కాదు. హృదయమునుండి ఆవిర్భవించాలి.

(7) ప్రేమస్వరూపులారా! ఈ జ్యోతి యింటింటికి తీసుకువెళ్ళి దర్శనములు జరుపుతున్నారంటే

720109012

ఇది కేవలము బయటనుండి వచ్చేది కాదు లోపలనుండి పుట్టేది. ఈ బాహ్యమైన జ్యోతుల కంటె అంతర్ముఖమైన జీవన జ్యోతిని పరిశుద్ధ పరచుకొని కాంతివంతమైన జ్యోతిగా వెలిగించుకోవాలి. సత్యసాయి సంస్థలన్నీ ప్రేమమయమైన సంస్థలుగా మారాలి. వ్యక్తిగతమైన ద్వేషములు మనము నిర్మూలము గావించాలి. జాతి మత కుల భేదములను మనము దూరము పెట్టాలి. నీతియే మన జాతిగా భావించాలి. మమతనే మన యొక్క మతముగా విశ్వసించాలి.

జాతి గౌరవంబు నీతిపై నిలుచును
నీతి లేక యున్న జాతి చెడును
నీతి కలుగు జాతి నిజమైన జాతిరా.

కాబట్టి ఏ జాతి అంటే నీతిలో వుండిన జాతి అనాలి. నీ మతమేదన్న మమతే నా మతం. ఈ భావములు మనస్సునందుంచుకొని దైవభక్తిని మనము అభివృద్ధి గావించుకోవాలి. ఈ ప్రపంచాన్ని సర్వవిధములా రక్షించేది ఒక్క దైవభక్తే తప్ప అన్యము కాదు. ఏ ప్రభుత్వము ప్రపంచాన్ని రక్షించలేదు. కేవలము భక్తులు మాత్రమే యీ ప్రపంచాన్ని రక్షించాలి. కనుక మనము దేశక్షేమమును దృష్టియందుంచుకొని నిత్యకళ్యాణము ను ఆశించి నగర సంకీర్తనము అభివృద్ధిగావించుకోవాలి.

1990 అక్టోబరు 20వ తేదీ శనివారం ప్రశాంతినిలయంలో భగవాన్ బాబావారి దివ్యోపన్యాసం